క్లుప్తంగా

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన



రేపల్లెరూరల్: విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు ఆర్డీవో హెలా షారోన్ వెల్లడించారు. పట్టణంలోని పలు ఇంటర్ పరీక్షా కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. అధ్యాపకులతో పాటు ప్రత్యేక సిబ్బంది, పోలీసుల నిఘా పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. ఆయా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటంతో పాటు ఆరోగ్య సిబ్బందిని సైతం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

ముస్సిపల్ చైర్‌పర్సన్ మంగ



రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పేదల సొంతింటి కల నెరవేరిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. జగనన్న కాలనీలోని నివేసన స్థలాలు పొందిన 2, 3 వార్డులకు చెందిన లబ్ధిదారులకు 2వ వార్డు సచివాలయంలో బుధవారం రిజిస్ట్రేషన్ పట్టాలను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. పట్టణంలోని అద్దె గృహాలలో సుదీర్ఘ కాలంగా ఉంటూ బాధలు పడుతున్న ప్రజల సొంతింటి కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దీక్ష, పట్టుదలతో సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి : డీఆర్‌డీఏ పీడీ కృష్ణ

అల్లూరు(కర్లపాలెం): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే నాణ్యమైన పంటలకు మంచి ధర లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ తెలిపారు. అల్లూరు గ్రామంలో డ్వాక్రా సమైఖ్య సంఘాలలోని మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను డీఆర్‌డీఏ పీడీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ వరదానం ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణకు వివరించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ యు.సుబ్బారావు, డీఎల్ఎంటీ మోహన్, ఎస్ఎఫ్ఎస్ లక్ష్మీ ప్రసన్న, ఏపీఎం, సీసీలు రైతులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులకు ముందస్తు సమాచారం అందించినప్పటికీ సగం మంది అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టిప్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి రానటువంటి అధికారులకు నోటీసులు పంపాలని ఎంపీపీ ఆదేశించారు. ఇటీవల జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి రాకుండా ఉన్న వలంటీర్లకు మెమోలు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. అధికారులు రాని సమావేశానికి మమ్మల్ని ఎందుకు పిలిపించారని పెదలంక ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి ప్రశ్నించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించడం లేదని నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిషత్ గ్రాంట్‌తో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ అధ్వానంగా ఉందని కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇవ్వడం వల్ల రూ.6 లక్షలు ప్రజల సొమ్ము వృథా అయ్యిందని వాపోయారు. సమావేశంలో ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు, వైస్‌ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, సూరింటెండెంట్ సీహెచ్ జలజ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మహాసభను జయప్రదం చేయండి

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల కన్వీనర్ తోడేటి ఏసుపాదం మాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగుల గర్జన మహాసభ కరపత్రాల్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు మాదిగ, మాలమహానాడు, దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కోడిరెక్క కోటిరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ. ఆరు వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహాశివరాత్రి తిరునాళ్లకు ముస్తాబయిన శైవ క్షేత్రాలు

అరవపల్లి, మోర్తోటలలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



బాలకోటేశ్వరుని మూల విరాట్టు

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకున్న దేవాలయాల్లో రేపల్లె మండలంలోని అరవపల్లి గ్రామంలో శ్రీబాల కోటేశ్వరస్వామి దేవాలయం, దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన మోర్తోట గ్రామంలో వేంచేసి యున్న ముక్తేశ్వర స్వామి ఆలయాలు పేరొందాయి. మూడు రోజుల పాటు జరగనున్న అరవపల్లి తిరునాళ్ల మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ, ధర్మదాయ శాఖాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయానికి రంగులువేసి విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. తిరునాళ్లకు గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 7న పశు ప్రదక్షణ, 8న మహాశివరాత్రి వేడుకలు, 9న ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అరవపల్లి దేవాలయ అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. మోర్తోటలో 7, 8 తేదీలలో ముక్తేశ్వరస్వామికి అభిషేక మహోత్సవాలు, 9న స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో జరగనున్నాయి.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

గోవాడ(వేమూరు): ఈ నెల 8న గోవాడలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ ఈవో ఈమని అశోక్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి బుధవారం తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో కొలువైన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి గాంచింది. ఈ ఏడాది మహాశివరాత్రికి సుమారు 2.50 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. శివరాత్రికి వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో భక్తుల సంఖ్య పెరుగుతుందని ఆయన తెలిపారు. భక్తులు ఎండ తీవ్రతను తట్టుకొనేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు సేవలందించేందుకు 40 మంది దేవాదాయ, ధర్మాదాయ శాఖల సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. వీరితో పాటు తెనాలి, చినపరిమి, పొన్నూరు, చెరుకుపల్లి గ్రామాలకు చెందిన స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు సేవలందిస్తారని తెలిపారు.



తిరునాళ్లకు ముస్తాబయిన బాలకోటేశ్వర స్వామి దేవస్థానం

పెదపులివర్రులో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేసే ముందు పలువురు దంపతులు, ముత్తయిదువులు పసుపు కొట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని దేవాలయ కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంపని అంజయ్య, సభ్యులు పర్యవేక్షించారు. గురువారం నెమలి వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెల్లటూరులో కల్యాణ మహోత్సవాలు



మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారు, శ్రీ గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల త్రయాహ్నిక దీక్షా దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలా చార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయుట, రాత్రి ధ్వజారోహణ, శుక్రవారం జగజ్యోతి, స్వామి వార్ల కల్యాణోత్సం, రాత్రి నంది వాహనంపై గ్రామోత్సవం, శనివారం రథోత్సవం, 10న వసంతోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ సూక్త విధాన కుంకుమ పూజ జరుగుతుందని తెలిపారు.

నూరేపల్లిలో కల్యాణమహోత్సవాలు ప్రారంభం


నూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం నూరేపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో శివ పార్వతుల కల్యాణం, తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రభను, గూడు బళ్లను అందంగా తీర్చిదిద్దారు. ఈ నెల 3వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యా యి. స్వామి వారికి భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించుకోవడం ఇక్కడ ప్రత్యేకత. భక్తులకు శివరాత్రి పర్వదినాన ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



పెండ్లి కుమారుడైన రాజరాజ నరేంద్రస్వామి



గోవాడలోని బాల కోటేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం



ఉత్సవాలకు ఏర్పాటు చేసిన గూడుబళ్లు

సీఎం జగన్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో రూ.1.28 కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ విద్యా రంగంలో తీసుకురాని విప్లవాత్మక మార్పులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల రూపు రేఖలను పూర్తిగా మార్చి వేశారని అన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ పేద విద్యార్థులు సైతం ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసించే విధంగా అవకాశం కల్పించారన్నారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కుటుంబ సభ్యులు జెడ్పీ హైస్కూలు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మోపిదేవి తండ్రి మోపిదేవి వీర రాఘవయ్య జ్ఞాపకార్థం అందించి ఉదారతను చాటు కోవటం అభినందనీయమన్నారు. రూ.40 లక్షల ఎంపీ నిధులు, రూ.88 లక్షల నాడు–నేడు నిధులతో జెడ్పీ ఉన్నత పాఠశాను అందంగా తీర్చిదిద్దటం జరిగిందన్నారు. నూరు శాతం మౌలిక సదుపాయాలు కల్పించిన పాఠశాలలో విద్యార్థులు విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో నూతనంగా రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీటీసీ సభ్యులు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిజాంపట్నంలో పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి, సమన్వయకర్త డాక్టర్ ఈవూరి

నిజాంపట్నం: విద్యార్థులు దాతలు అందిస్తున్న ప్రోత్సాహక బహుమతులను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో పల్లవ సేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష సామాగ్రిని అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ తీరంలోని కుగ్రామం కొత్తపాలెం గ్రామంలో విద్యార్థుల సంక్షేమం కోసం పల్లవ సేన సంక్షేమ సంఘం తమ వంతు సహకారం అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, జ్యామెంట్రీ బాక్స్ కిట్లను అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ చెన్ను లక్ష్మణరావు, గుంటూరు జిల్లా పల్లవసేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోపిదేవి శివనాగరాజు, సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, ఎంపీటీసీ సభ్యులు గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌గా మారిన గడియార స్తంభం సెంటర్

బాపట్ల: బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌కు గాంధీ చౌక్‌గా నామకరణం చేయటం ఎంతో సంతోషకరంగా ఉందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. తొలుత కన్యకా అమ్మవారి గుడి నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్యే రఘుపతి గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. గడియార స్తంభం సెంటర్‌ని బుధవారం గాంధీచౌక్‌గా నామకరణం చేశారు. ఆర్య వైశ్య సంఘం, యంగ్ మెన్ వైశ్య వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు తూనుగుంట్ల శ్రీనివాసరావు, కొత్త మాసు సత్యనారాయణ, బుర్లె అనిల్, కోళ్లపూడి సురేష్, కోళ్లపూడి ఉపేంద్ర గుప్తా, నాలం నరేష్, పల్లపోతు దిలీప్, యారం మణి, ఇమ్మడిశెట్టి రాము, బుర్రంశెట్టి సుజిత్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే రఘుపతి

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ సంకల్పం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

నిజాంపట్నం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. 'సిద్ధం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొర్రావారిపాలెం పంచాయతీ కేసనవారిపాలెం గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్న స్థితిలోనూ మడమ తిప్పక పేద ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తూ కోట్లాది నిధులు వ్యయం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఈవూరి దంపతులకు గ్రామస్తులు హారతులు పట్టారు.

కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, డాక్టర్ సృజన్, న్యాయవాది బొర్రా వెంకట సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాటూరి శివనాగబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేసనవారిపాలెంలో ఈవూరికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ముస్లిం స్మశాన వాటికకు రహదారి ఏర్పాటు

సొంత ఖర్చుతో స్థలం సమకూర్చిన ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: ముస్లింల స్మశాన వాటికకు కొత్త ఇస్లాంపేట నుంచి వెళ్లేందుకు దారిలేక పోవటంతో ఎమ్మెల్యే కోన రఘుపతి తన సొంత నిధులతో 20 సెంట్లు స్థలం కొనుగోలు చేసి దారి ఏర్పాటు చేయటంతో కొత్త ఇస్లాంపేట ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ముస్లిం స్మశాన వాటికకు కొత్త ఇస్లాంపేట నుంచి వెళ్లాలంటే దగ్గర మార్గంలో సరైన దారి లేక జాతీయ రహదారి నుంచి కర్లపాలెం సెంటర్‌కు వెళ్లి గొడపాలెం మీదుగా స్మశాన వాటికకు వెళ్ళాల్సి వస్తుంది. ఈ దారిలో ముస్లింలు స్మశానానికి వెళ్లేందుకు గత 30 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ముస్లిం పెద్దలు తమ సమస్యను ఎమ్మెల్యే కోన రఘుపతికి ఇటీవల తెలియ జేయటంతో స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.10 లక్షలతో సుమారు 20 సెంట్ల స్థలాన్ని రహదారి కోసం కొనుగోలు చేసి ఇచ్చారు. స్మశాన వాటికకు వెళ్లేందుకు కొనుగోలు చేసిన స్థలాన్ని బుధవారం కోన రఘుపతి పరిశీలించారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోన ముస్లింలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు ఎండీ అమీర్‌బేగ్, ఆసిఫ్ అలీ, అహ్మదుల్లా బేగ్, సాబీర్, మహబూబ్‌వలీ, అక్బర్‌వలీ, తాజ్, షంషీర్, ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లావుల ఏడుకొండలు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో ముస్లిం స్మశాన వాటిక దారిని పరిశీలిస్తున్న రఘుపతి, పార్టీ నాయకులు

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

డీఎల్‌పీవో తాతా శివశంకరరావు

చెరుకుపల్లి: మహాశివరాత్రి పర్వదినానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా రహదారుల వెంట ఎటువంటి ఆక్రమణలు ఉన్నా త్వరిత గతిన తొలగించాలని డీఎల్‌పీవో తాతా శివశంకరరావు ఆదేశించారు. ఈ నెల 8న మహాశివరాత్రి పండుగ సందర్భంగా గోవాడ బాలకోటేశ్వరస్వామి గుడికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు చెరుకుపల్లి–గోవాడ రోడ్డు మార్గంలో జరుగుతున్న పనులను శంకరరావు బుధవారం పరిశీలించారు. పారిశుద్ధ్యం పట్ల ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈవూరి విజయ్‌బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న శివ శంకరరావు

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం

- నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలు
- బాధితులకు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శ
- ఆర్థిక సహాయం అందజేత

పొన్నూరు: పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఏడు గుడిసెలు దగ్ధమయ్యాయి. వాటిలో నివాసం ఉంటున్న తొమ్మిది కుటుంబాలకు చెందిన వారు నిరాశ్రయులయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఒక ఇంటిలోని విద్యుత్ తీగల్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో మంటలు వ్యాపించి గ్యాస్ సిలిండర్‌పై పడ్డాయి. అది పగలడంతో మంటలు చెలరేగి పక్కనున్న ఏడు గుడిసెలకు వ్యాపించడంతో అగ్నికి ఆహుతయ్యాయి. గుడిసెలలో నివాసం ఉంటున్న తొమ్మిది కుటుంబాల వారు బయటికి పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక వాహనం వచ్చినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇళ్లలోని సామగ్రిని తీసుకునే సమయం కూడా లేకపోవడంతో వస్త్రాలు, 40 వేల రూపాయల విలువ చేసే బంగారపు వస్తువులు, వెండి పట్టీలు అగ్నిలో కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సహాయం చేశారు. ముస్లిం నాయకులు షేక్ నాజర్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు పాల్గొన్నారు. తహసీల్దార్ నారాయణ సింగ్, పట్టణ సీఐ పి. భాస్కర్ బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

- ట్రికార్(ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ) చైర్మన్ గుండా సురేంద్ర, జిల్లా అధికారి శిరీష అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాల్ని పరామర్శించారు.



పిల్లలను హత్తుకున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు

వరహాపురం(వేమూరు): ప్రజలకు మేలైన ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్, పలువురు వైద్యులు 404 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

నకిలీ బంగారం పట్టివేతలో పలువురిపై కేసులు

గోల్డ్ అప్రైజర్‌తో పాటు మరో 41 మందిపై కేసులు నమోదు

బాపట్లటౌన్ : నకిలీ బంగారంతో బ్యాంక్‌కు టోకరా వేసిన వ్యవహారంలో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బాపట్లలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ శ్రీహరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ బంగారం పెట్టి రూ.కోట్లు కొల్లగొట్టిన 41 మంది ఖాతాదారులు, గోల్డ్ అప్రైజర్ వెల్లటూరి రాఘవేంద్రరావులపై కేసులు నమోదుచేశారు. ఈ వ్యవహారంలో బ్యాంక్ అధికారుల పాత్రపై పోలీసులు విచారిస్తున్నారు. తాజాగా జరిగిన నకిలీ బంగారం వ్యవహారంతో పాటు గతంలో ఇదే తరహా కేసులు ఏమైనా జరిగాయా అనే కోణంలో అన్ని ఖాతాలను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా విచారిస్తున్నట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కాలంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో నకిలీ బంగారం పెట్టి రూ. 1.77 కోట్ల రుణాన్ని కొల్లగొట్టిన వ్యవహారం వెలుగుచూసిన విషయం తెలిసిందే.

నేడు మహిళా సదస్సు

భట్టిప్రోలు: సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 3 గంటలకు భట్టిప్రోలు కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు యుటీఎఫ్ అధ్యక్షుడు వి. సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల సిబ్బంది హాజరు కావాలని కోరారు.

వేమూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం 3 గంటలకు సమావేశం నిర్వస్తున్నట్లు ఎంపీపీవో శేషగిరిరావు బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల హక్కులు, మహిళా సాధికారత, సామాజిక మార్పుపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న హారిక

చెరుకుపల్లి: గూడవల్లి టీఆర్‌సీ ఐటీఐ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు ఎంగ్ ప్రొఫెషనల్ హారిక పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు జిల్లా నలు మూలల నుంచి 95 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 45 మందిని వారి ప్రతిభను బట్టి వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నారు. ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, ఫక్స్‌టెక్ సొల్యూషన్, హెటిరో డ్రగ్స్, ఆదిత్య బిర్లా కాపిటల్స్, వెల్‌జాన్ డెనిసన్ లిమిటెడ్, హైదరాబాదుకు చెందిన ప్రిన్స్‌టన్ సాఫ్ట్‌వేర్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులను జాబ్‌మేళా ద్వారా ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి విష్ణుమూర్తి, బాపట్ల డీఎస్‌డీవో తమ్మాజీరావు, జిల్లా కన్వీనర్ సుధాకర్‌బాబు, గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి శ్యామ్‌ప్రసాద్, కళాశాల సిబ్బంది, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చేబ్రోలు: మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి అన్నారు. కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గుండవరం, గొడవర్రు గ్రామాల సర్పంచులు చుక్కా సాయి నాగేంద్రమ్మ, బీరం జానకీదేవిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహనానికి ప్రతి రూపం స్త్రీ అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు ఏడుకొండలరావు, ఏ. రామకృష్ణారావు పాల్గొన్నారు.